క్లుప్తంగా

నేడు హుండీ కానుకల లెక్కింపు

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్దనున్న అతి పురాతన శైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలోని హుండీ కానుకలను శుక్రవారం లెక్కించనున్నారు. ఈ మేరకు దేవదాయశాఖ ఈఓ గాదె రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సత్తెనపల్లి దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఈ లెక్కింపు ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు రెంటచింతల గ్రామంలోని శివాలయంలోనున్న హుండీ కానుకలనూ లెక్కించనున్నట్లు తెలిపారు.

11న ఉచిత కంటి వైద్య శిబిరం

దాచేపల్లి: నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 11వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు దిమధర స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు నాగెండ్ల సుమతీరత్నం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో రేషన్ కార్డు, ఆధార్ కార్డు వెంట తెచ్చుకుని సేవలు పొందవచ్చని చెప్పారు. కంటి శుక్లాలతో బాధపడే వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. వివరాలకు 99660 45613, 81063 69726 ఫోను నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా శిఖర ప్రతిష్ట



దాచేపల్లి: మండలంలోని ముత్యాలంపాడు గ్రామ సమీపంలో కోట మైసమ్మ దేవాలయంలో శిఖర ప్రతిష్ట పూజలు గురువారం వైభవంగా జరిగాయి. తంగెడ గ్రామ పురోహితుడు జానపాటి సీతారామశర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాచేపల్లికి చెందిన గరికపాటి శివప్రసాద్ కుటుంబ సభ్యులు బహూకరించిన శిఖరం వద్ద ప్రత్యేక పూజలు చేసి, ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

షిరిడీ సాయిబాబాకు పూజలు



పాలువాయి జంక్షన్ (రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్దనున్న షిరిడీ సాయిబాబా దేవస్థానంలో ప్రధాన అర్చకుడు గోపాల్ పాండే ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. భజన బృందం ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫిల్టర్ ట్యాంక్ శుభ్రం చేసిన యంత్రాంగం



సాక్షి ఎఫెక్ట్

దాచేపల్లి: ఎట్టకేలకు ఫిల్టర్ ట్యాంక్‌ని గురువారం శుభ్రం చేశారు. మండలంలోని పొందుగల గ్రామంలో తాగు నీటిని శుభ్రం చేసే ఫిల్టర్ ట్యాంక్ అపరిశుభ్రంగా ఉంది. మూతబావి కాదు.. ఫిల్టర్ ట్యాంక్ అనే కథనం సాక్షిలో గురువారం ప్రచురితమైంది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఫిల్టర్ ట్యాంక్‌ని సిబ్బందితో శుభ్రం చేయించారు. బ్లీచింగ్ చల్లారు. ఏఈ అంగడి సోమయ్య ఈ పనులను పర్యవేక్షించారు. సాక్షి చొరవతో ట్యాంక్ శుభ్రం చేయటంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి



రెంటచింతల: ఆపరేషన్ సిందూర్‌తో పహల్గాం ఉగ్రదాడి ఘటనలో మృతి చెందిన వారికి ఘన నివాళులు అర్పించినట్లు అయిందని బీజేపీ మండల అధ్యక్షుడు బోయ నాగిరెడ్డి అన్నారు. గురువారం రెంటచింతలలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిలో వీరమరణం పొందిన వారికి దేశం సెల్యూట్ చేస్తోందన్నారు. ఉగ్రవాదులను పూర్తిగా తుడిచిపెట్టే వరకు సైన్యం పోరాటం చేయాలన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. భారత మాతకు జై అంటూ నినాదాలు చేశారు. సమావేశంలో మండల కోశాధికారి కొత్త రాజేశ్వరరావు, పెనుగొండ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు



అవగాహన కల్పిస్తున్న బ్రహ్మారెడ్డి

రెంటచింతల: పంటలను సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. భూమిలో సూక్ష్మ పోషకాలపై రైతులకు అవగాహన కలుగుతుందని తెలిపారు.

గురువారం ఆయన రెంటచింతలలోని పంట పొలాలలో మట్టి నమూనాలను సేకరించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. సూక్ష్మ పోషకాల లోపాలు ఉంటే పరీక్షల ద్వారా గుర్తించవచ్చన్నారు. లేదంటే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని హెచ్చరించారు. ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడుకోవాలని తెలిపారు. తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో వీఏఏలు, వీహెచ్ఏలు గొంటు కృష్ణారెడ్డి, పవన్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ఉంటాం



హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లింలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

దాచేపల్లి: ముస్లింలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. హజ్‌యాత్రకు వెళ్లుతున్న మూడు ముస్లిం కుటుంబాలకు రూ. లక్ష చొప్పున స్థానిక విజయభాస్కర కల్యాణ మండపంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు బెల్లంకొండ బద్రి, చింతపల్లి హసన్ అహ్మద్, షేక్ వలి, షేక్ జానీ బాషా, నాయబ్ అబ్దుల్లా, తంగెళ్ల శ్రీనివాసరావు, తోట వెంకటేశ్వర్లు, నర్రా పుల్లయ్య, వేముల తిరుమలకుమార్, పగడాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిశీలన

పిడుగురాళ్ల: పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో వైద్యులతో మాట్లాడారు. ప్రజలకు తగిన వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు.

సమ్మెను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అంజనేయులు

పిడుగురాళ్ల: ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని కన్నెగంటి హనుమంతు భవనంలో సంపత్ వెంకటకృష్ణ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. వారికి లాభాలు చేకూర్చేలా కార్మికుల శ్రమను దోచుకునే విధానాలను అమలు చేస్తున్నట్లు ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే పనిలో కేంద్రం ఉందన్నారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, ఏఎఫ్‌టీయూ న్యూ నాయకులు కొండారెడ్డి చెన్నయ్య, సున్నం బట్టి వాచ్మెన్ యూనియన్ సీఐటీయూ నాయకులు ఓర్సు కృష్ణ, డి.శాంతమణి, షేక్ హజ్రా, జయశ్రీ, బత్తుల కొండలు, గుంటి నాగేశ్వరరావు, అంగిడి వెంకటేశ్వర్లు, సుధాకర్, కంపా సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



సూపర్‌వైజర్ కోటేశ్వరమ్మకు సమ్మె నోటీసు అందిస్తున్న నాయకులు

పిడుగురాళ్ల: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ కోటేశ్వరమ్మకు గురువారం సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు, జీతాలు ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు నిధులు పెంచాలని కోరారు. సెంటర్ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. గ్రాట్యుటీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం జరిగే సమ్మెలో అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు షేక్ హజ్రా, డి. శాంతమణి తదితరులు పాల్గొన్నారు.

వేప చెట్టుపై పడిన పిడుగు



పిడుగురాళ్ల: భారీ వర్షం కురవటంతో గురువారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో పిడుగు పడి వేప చెట్టు నేలకొరిగింది. ఈ సంఘటన మండలంలోని కామేపల్లి నుంచి మాచవరం వెళ్లే ప్రధాన రహదారి పక్కన జరిగింది. ఆ సమయంలో అదృష్టవశాత్తు అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పిడుగురాళ్ల: ప్రభుత్వ ఆదేశాల మేరకు రానున్న ఐదు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాల పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఎటువంటి ఇబ్బంది కలిగినా సమీపంలోని సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. భారీ వర్షం, ఈదురుగాలులు ఉన్నప్పుడు చెట్ల కింద ఉండొద్దని, తడిసిన స్తంభాలను తాకరాదని ఆయన తెలిపారు. రోడ్లపై చెట్లు విరిగిపడినా, కూలినా కాల్ సెంటర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. వర్షాకాలం సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

బొల్లాపల్లి : ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యంను పరిశీలించి రసాయనిక పరీక్షకు శాంపిల్ బాటిల్‌ను సేకరించారు. దుకాణాల్లోని మద్యం ధరలను నిర్ధారించుటకు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలను దుకాణాదారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు



అచ్చంపేట: మండలంలోని కోనూరులో నూతనంగా నిర్మించిన గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి నూతన దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం కనుల పండువలా జరిగాయి. ఈ సందర్భంగా వేకువజామున సుప్రభాత సేవ, గణార్చనలు, పుణ్యాహవాచనం, వాస్తు పూజలు, మహారుద్ర హోమం, గర్తన్యాసం, దఫాతున్యాస, భీజన్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 6.54 గంటలకు యంత్రస్థాపన శిలా విగ్రహ ప్రతిష్ఠ జరిగాయి. అనంతరం దృష్టి స్థాపనలు, ధేనుదర్పణ దర్శనం, మహాకుంభాభిషేకములు, మహానివేదన, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. లోక కల్యాణం కోసం శాంతి హోమం నిర్వహించారు. పొరుగు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పొంగించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం జరిగింది.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు



సేద్యపు నీటి కుంట పనులను పరిశీలిస్తున్న పీడీ సిద్ధ లింగమూర్తి

మాచవరం: ఉద్యాన పంటల సాగు ఎంతో లాభదాయకమని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి అన్నారు. ఉపాధి హామీ పథకానికి అనుసంధానంగా ఉద్యాన పంటల సాగుపై రైతులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగు, సేద్యపు నీటి కుంటలు, సోక్ ఫిట్స్‌లేబర్ బడ్జెట్, ఇన్సూరెన్సు పాలసీ వంటి పథకాలపై గ్రామాలవారీగా సమీక్ష నిర్వహించామని తెలిపారు. పిల్లుట్ల గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న సేద్యపు నీటి కుంట పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగళరావు, ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్, వాల్యూ ఆఫ్ ఆయిల్ ఫార్మ్ చైర్మన్ రామ్మోహన్, ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్, వ్యవసాయ, ఉద్యాన శాఖల సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

రక్తం అందించి ప్రాణాలు కాపాడిన సంస్థ రెడ్ క్రాస్



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్ అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు

సత్తెనపల్లి: రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తం అందించి అనేకమంది ప్రాణాలు కాపాడిన గొప్ప సంస్థ రెడ్ క్రాస్ అని డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని గుంటూరు రోడ్‌లోని శివసదనంలో ప్రపంచ రెడ్ క్రాస్ సొసైటీ దినోత్సవంను పురస్కరించుకొని గురువారం సత్తెనపల్లి రెడ్ క్రాస్ సొసైటీ బ్రాంచ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా ప్రపంచ రెడ్ క్రాస్ సొసైటీ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ స్థాపన, ప్రపంచంలో ఈ సొసైటీ సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం 30 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి, శిబిరానికి సహకారం అందించిన వారికి రెడ్ క్రాస్ సొసైటీ సత్తెనపల్లి గౌరవ అధ్యక్షుడు రావెల చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది నరిశెటి వేణుగోపాల్, రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా మేనేజ్ కమిటీ సభ్యుడు పుట్టి సాంబశివరావు, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు, కోశాధికారి కాపుగంటి రత్తయ్య, కమిటీ సభ్యులు దేవరపల్లి మల్లికార్జునరావు, వల్లూరి శ్రీనివాసరావు, దనేకుల సాంబశివరావు తదితరులు ఉన్నారు.

భూమి ఆరోగ్యం కాపాడే చర్యలపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ అరుణ, పక్కన డీడీఏ శివకుమారి

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో రైతులకు భూమాత ఆరోగ్య పునరుద్ధరణ, పోషణ, ఆరోగ్య పెంపుదలపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి పాల్గొని రైతులకు భూమి ఆరోగ్యం కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎరువులు, క్రిమి సంహారక మందులు తక్కువ వినియోగించటం, బయో ఎరువులు వాడటం వలన కలిగే లాభాలను వివరించారు. ఈ విధానం పాటించడం వలన భూమి ఆరోగ్యం బాగుపడటంతో పాటు, ఆ భూమిలో పండిన పంటలు తినడం వలన ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ మాట్లాడుతూ పంట అవశేషాలను తగలబెట్టకుండా భూమిలోనే కలియదున్నటం వలన భూసారం పెరగటమే కాకుండా కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు. వేసవి కాలంలో భూములు ఖాళీగా వదలకుండా మినుము, పెసర వంటి పంటలు వేసుకోవడం వలన అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమలశెట్టి సైదుబాబు, ఏఈఓ నరేష్, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు, రైతులు పాల్గొన్నారు.

పెండ్లి కుమారుడిగా రంగనాథుడు

- అట్టహాసంగా కల్యాణోత్సవాలు ఆరంభం
- సొలస గ్రామంలో ఆధ్యాత్మిక శోభ



పసుపు దంచుతున్న భక్తులు



పెండ్లికుమారుడిగా కొలువుదీరి రంగనాథుడు, పక్కనే శ్రీ- భూదేవి అమ్మవార్లు

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామం ఆధ్యాత్మిక కళతో శోభిల్లింది. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవస్థానంలో కల్యాణ మహోత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి వారంరోజులు జరిగే స్వామివారి కల్యాణోత్సవాలు గ్రామ పెద్దలు, ధర్మకర్తలు సమన్వయంతో వైభవోపేతంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా ఆలయానికి కొత్తరంగులు, షామియానాలు, విద్యుద్దీపాలంకరణ చేశారు. కల్యాణోత్సవాల్లో భాగంగా వేకువజామునే ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యుల నేతృత్వంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, అనంతరం విశేష అలంకరణలు చేశారు. మహిళలు మేళతాళాలు, బాజాభజంత్రీలు నడుమ ఆలయ ప్రాంగణంలో భక్తి కీర్తనలు ఆలపిస్తూ పసుపు కొట్టుడు, మెహందీ వంటి సంప్రదాయ కార్యక్రమాలతో ఉత్సాహంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్ దంపతులు, అర్వపల్లి బ్రదర్స్ స్వామివారికి నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం రంగనాథుడిని పెండ్లికుమారుడిగా, శ్రీదేవి, భూదేవిలను పెళ్లి కుమార్తెలుగా సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. సాయంత్రం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణ వంటి క్రతువులు నిర్వహించి పలు రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానికులే కాకుండా సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలను దేవస్థాన ఈవో, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ గావించారు.

తూనికలు, కొలతల్లో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

లీగల్ మెట్రాలజీ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా



ఏఎంసీ ఆవరణలోని రైతు బజార్‌లో మాట్లాడుతున్న షేక్ సైదా

సత్తెనపల్లి: తూనికలు, కొలతల్లో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని లీగల్ మెట్రాలజీ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా అన్నారు. తూనికలు కొలతలు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలోని రైతు బజార్‌లో వినియోగదారులకు, వర్తకులకు లీగల్ మెట్రాలజీ అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ వినియోగదారులు కూరగాయలు, ఇతరత్రా కొనుగోలు చేసినప్పుడు వారికి కచ్చితమైన తూకం ప్రకారం విక్రయించాలని, అందుకు వాడేటువంటి కాటాలను ప్రతి సంవత్సరం లీగల్ మెట్రాలజీ ఆధ్వర్యంలో జరుగుతున్న స్టాంపింగ్‌కు పంపించి తప్పనిసరిగా రసీదు పొందాలని తెలిపారు. పల్నాడు జిల్లా వినియోగదారుల సంఘం(ఏంజెల్ ఫ్రైడ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్) జిల్లా సెక్రటరీ బెల్లంకొండ నాగసాయి ప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులు కూరగాయలు, ఇతరత్రా కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కచ్చితమైన తూకం అడిగే హక్కు వినియోగదారునికి ఉందని, తూకాలలో తేడా ఉంటే సంబంధిత అధికారులకు గానీ, వినియోగదారుల సంఘం వారికి గానీ ఫిర్యాదు చేసే హక్కు ఉందన్నారు. అదేవిధంగా కాటాలు స్టాంపింగ్ చేసి ఉన్నాయో లేదో పరిశీలించుకునే హక్కు కూడా ఉందన్నారు. అనంతరం రైతు బజార్‌లో వ్యాపారం నిర్వహిస్తున్న వర్తకులకు, వినియోగదారుకు వస్తువులు కాటా వేసే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం సత్తెనపల్లి (ఏంజెల్ ఫ్రైడ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్) ప్రతినిధులు వనమా నాగేశ్వరరావు, ఆవులమంద కమలాకర్, కొప్పురావూరి కాశీ వెంకట సుబ్బారావు, లీగల్ మెట్రాలజీ సిబ్బంది ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

అగ్రిల్యాబ్ ద్వారా ఉచితంగా విత్తన, ఎరువుల పరీక్షలు

ఏడీఏ వి.హనుమంతరావు



క్రోసూరు: రైతు ప్రయోజనాల కొరకు రాష్ట్రంలో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్‌లలో పెదకూరపాడు నియోజకవర్గ ల్యాబ్ ఒకటని రైతులు ఉచితంగా విత్తన, ఎరువులు, మట్టి పరీక్షలు పొందవచ్చునని ఏడీఏ హనుమంతరావు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని ఆధునిక, సాంకేతికత సమన్వయంతో రైతుల సమస్యలకు శాస్త్రీయ పరిష్కారం చూపి సాగును లాభదాయకంగా మార్చేందుకు పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. విత్తనాలలో మొలక శాతం, తేమ శాతం, భౌతిక పరీక్షలు ల్యాబ్‌లో ఉచితంగా చేయటం జరుగుతుందన్నారు. ఎరువులలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, సల్ఫర్ పరీక్షలు జరుపబడునని తెలిపారు. ఇప్పటి వరకు గత మూడు సంవత్సరాలుగా విత్తన నమూనాలు 690, ఎరువుల నమూనాలు 408 పరీక్షలు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అధీకృత లైసెన్సు వ్యాపారులు విత్తన నాణ్యత పరీక్షకు రూ.250, ఎరువుల నాణ్యత పరీక్షలకు ఒక్కొక్కదానికి రూ.1,000 గరిష్టంగా రూ.4 వేలు చెల్లించాలన్నారు. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని లేదా ఏవోను సంప్రదించి విత్తన, ఎరువుల పరీక్షలకు వాటి నమూనాలను అగ్రి ల్యాబ్‌లో అందజేస్తే ఏడు నుంచి 10 రోజుల్లో ఫలితాలు పొందవచ్చన్నారు.

ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులలో సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు రెడ్‌క్రాస్ దోహదపడుతుందని వాగ్దేవి విద్యాసంస్థల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు తెలిపారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాగ్దేవి జూనియర్ కళాశాలలో గురువారం పల్నాడుజిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు జాన్ హెన్రీ డూన్ హంట్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రకృతి విపత్తులు సమయంలో ప్రపంచ వ్యాప్తంగా రెడ్‌క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు రెడ్‌క్రాస్ వాలంటీర్లుగా సామాజిక సేవలో భాగస్వాములు కావాలని హితవు పలికారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కె.జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు రెడ్‌క్రాస్ సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందచేస్తారనీ, విద్యార్థులు వాటిని గ్రేస్ పాయింట్లకు ఉపయోగించుకోవచ్చని వివరించారు. కాగా, ఉచిత వైద్య శిబిరంలో చెవి, ముక్కు పరీక్షలను డాక్టర్ జగన్మోహనరెడ్డి, దంత సమస్యల పరీక్షలను డాక్టర్ రహంతుల్లా, కంటి పరీక్షలను డాక్టర్ సృజన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కూరపాటి గుప్త, జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

రైతు బజార్‌ను కాపాడండి

సత్తెనపల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గతంలో నెలకొల్పిన రైతు బజార్ కునారిల్లుతుందని, దానిని కాపాడాలని జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు గురువారం కోరారు. కొత్తగా వచ్చిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం తీసుకున్న నిర్ణయం వల్ల రైతు బజార్ నష్టాల బాట పడుతుందన్నారు. ఎప్పుడూ లేని విధంగా వ్యవసాయ మార్కెట్ యార్డు లోపలకి వెళ్లే దారులు మూసేయడం వల్ల రైతు బజార్‌కు వెళ్లే వారి సంఖ్య బాగా తగ్గిపోయిందన్నారు. వినియోగదారులు కూడా రైతు బజార్‌కు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ట



శావల్యాపురం: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో నూతనంగా మహాగణపతి, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి, శివలింగ, నందీశ్వర, నాగేంద్రస్వామి, విగ్రహ ప్రతిష్ఠా వేడుకలు గురువారం ఉదయం 9.36 నిమిషాలకు వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధి దమ్మాలపాటి సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు దాతలు సహకారంతో దేవాలయం పునః నిర్మాణ పూర్తి చేశామన్నారు. వేదపండితులు బ్రహ్మశ్రీ అయినాల నాగేశ్వరరావు ఆచారి, కడియాల ఆంజనేయ శాస్త్రి, సొలస శివయ్య శాస్త్రి వేద మంత్రాల నడుమ ప్రతిష్ఠా వేడుకలు వైభవంగా ముగిసినట్లు తెలిపారు. నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, తదితరులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన సంతర్పణ కూడా ఏర్పాటు చేశారు.